అశోకా వన్‌ మాల్‌లో ఉచిత వైద్య శిబిరం



మూసాపేట: కూకట్‌పల్లిలోని అశోకా వన్‌ మాల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమోర్‌ హాస్పిటల్‌ సహకారంతో కంటి పరీక్షలు, డెంటల్‌ పరీక్షలు, డయాబెటిక్‌ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా అశోకా వన్‌ మాల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ జైదీప్‌ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కేన్సర్‌ దినోత్సవం సందర్భంగా ఉచిత ఆరోగ్య ప్రచార కార్యక్రమం నిర్వహించామని, ఆరోగ్య పరీక్షల ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించి నివారించుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ సిబ్బంది, మాల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థం

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో రంగనాథుడి చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలోని బావి వరకు ఊరేగింపుగా వెళ్లి చక్రతీర్థ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పూర్ణాహుతి, వసంతోత్సవం, ద్వాదశ ఆరాధన, దేవతావిసర్జనం, ధ్వజారోహణం, భేరిపూజ, మూకబలి, సప్తవర్ణ పూజలు చేశారు.అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌ స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు



నోటీసులు అందజేస్తున్న ఐలా మేనేజర్‌ సుధాకర్‌రెడ్డి

జీడిమెట్ల: టీఎస్‌ఐఐసీ గ్రీన్‌బెల్ట్‌ స్థలంలో బిల్డింగ్‌ మెటీరియల్స్‌ వ్యాపారం నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఐలా అధికారులు మంగళవారం నోటీసులు అందజేశారు. షాపూర్‌నగర్‌ మార్కెట్‌ నుంచి సాయిబాబానగర్‌ వరకు నర్సాపూర్‌ రోడ్డులో జీడిమెట్ల ఇండస్ట్రియల్‌ ప్రాంతానికి ఆనుకుని గ్రీన్‌బెల్ట్‌ స్థలం ఉంది. సదరు స్థలంలో టీఎస్‌ఐఐసీ, ఇండస్ట్రియల్‌ అథారిటీ అధికారులు సంయుక్తంగా మొక్కలు నాటించారు. కానీ కొంతమంది బిల్డింగ్‌ మెటీరియల్స్‌ వ్యాపారస్తులు సదరు స్థలంలో కొన్ని చెట్లను తొలగించి ఇసుక, కంకర, ఇటుక, ఎర్రమట్టి, డస్ట్‌ వంటి బిల్డింగ్‌ మెటీరియల్స్‌ను అన్‌లోడింగ్‌ చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. అదే రోడ్డులో దాదాపు 50మంది వరకు గ్రీన్‌బెల్ట్‌ స్థలంలో ఇదే వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో మంగళవారం పలువురు వ్యాపారస్తులకు ఐలా మేనేజర్‌ సుధాకర్‌రెడ్డి నోటీసులు అందజేశారు. వెంటనే ఇక్కడి నుంచి మెటీరియల్స్‌ను ఖాళీ చేయాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.

ఘనంగా ధ్వజారోహణం



కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వైనతేయ ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటలకు దేవతాహ్వానం, గజవాహన అలంకార సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

గార్డెన్‌ బస్తీ నూతన కమిటీ



కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ గార్డెన్‌ బస్తీకి చెందిన నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం మాజీ డీసీసీ కేఎం ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కాలనీలో ఏ సమస్య నెలకొన్నా అండగా ఉంటానని, అభివృద్ధిలో సంక్షేమ సంఘం ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు.

ఉద్యోగం, ఉపాధికి గ్యారెంటీ

పాలిసెట్‌పై ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్న జీఐఎల్‌టీ

- బీహెచ్‌ఈఎల్‌–మెహిదీపట్నం వరకు 25 జెడ్పీహెచ్‌ఎస్‌లలో అవగాహన
- పాలిసెట్‌–2025కి నోడల్‌ ఏజెన్సీగా 'జీఐఎల్‌టీ'లో హెల్ప్‌లైన్‌ కేంద్రం
- ఈ ఏడాది 1000 మంది దరఖాస్తు చేసుకొనేలా ఏర్పాట్లు



మణికొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్‌ షేక్‌ ఎక్బాల్‌ హుస్సేన్‌

రాయదుర్గం: పాలిసెట్‌–2025పై పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టింది జీఐఎల్‌టీ. రాయదుర్గంలోని గవర్నమెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ లెదర్‌ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) ద్వారా అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాలిసెట్‌ పరీక్ష, దరఖాస్తు చేయడం, కోర్సులు, పాలిటెక్నిక్‌లో సీటు సాధన వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు జీఐఎల్‌టీలోని ఫ్యాకల్టీని గ్రూపులుగా ఏర్పాటు చేసి దశలవారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాలిటెక్నిక్‌ కోర్సులు, జీఐఎల్‌టీలో కోర్సులు పూర్తి చేసే వారికి 100 శాతం జాబ్‌ గ్యారెంటీ ఉంటుందని, ఇవి పూర్తి చేసిన విద్యార్థులు దేశ, విదేశాలలో ప్రైవేటు, ప్రభుత్వ లెదర్‌ కంపెనీలలో పని చేయడం లేదా సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే స్థాయిలో ఉన్నారని వివరిస్తున్నారు.

జీఐఎల్‌టీలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

పాలిసెట్‌ నిర్వహణలో నోడల్‌ ఏజెన్సీగా జీఐఎల్‌టీ గుర్తింపు పొందింది. దీంతో పాలిసెట్‌పై అవగాహన కోసం రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ కేంద్రం ఏర్పాటు చేశారు. పనివేళల్లో ఫ్యాకల్టీ, అధికారులు అందుబాటులో ఉంటారు. ఇందులో ప్రస్తుతం పదో తరగతి చదివే విద్యార్థులు వస్తే పాలిసెట్‌ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయిస్తారు. అంతేకాకుండా పాలిటెక్నిక్‌, జీఐఎల్‌టీ కోర్సుల గురించి తెలియజేస్తారు. గత ఏడాది ఈ కేంద్రం ఏర్పాటు చేయగా 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది 1000 మంది దరఖాస్తు చేసుకొనేలా ఏర్పాట్లు చేయాలని సంకల్పించారు.

భెల్‌- మెహిదీపట్నం వరకు పాఠశాలల్లో అవగాహన

బీహెచ్‌ఈఎల్‌ నుంచి మెహిదీపట్నం వరకు ఉన్న 25 జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటగా మణికొండలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే తరహాలో మిగతా జెడ్పీహెచ్‌ఎస్‌లలో కూడా పదవ తరగతి చదివే విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కుటుంబానికి త్వరితంగా ఆదాయం సమకూర్చే వ్యక్తులుగా విద్యార్థులు ఎదిగేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఏడాది చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు స్పందన బాగుండడంతో ఈ ఏడాది కూడా నిర్వహించనున్నారు.

ప్రతిఏటా అవగాహన కార్యక్రమాలు, పాలిసెట్‌పై శిక్షణ



ప్రతియేటా జెడ్పీహెచ్‌ఎస్‌లలో పాలిసెట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాలిసెట్‌ ప్రవేశ పరీక్ష, రాసే విధానంపై కూడా ప్రత్యేక శిక్షణను రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది 1000 మంది పాలిసెట్‌ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయించాలని లక్ష్యం. జీఐఎల్‌టీ, పాలిటెక్నిక్‌తో ఉపాధి గ్యారంటీ. జీఐఎల్‌టీలోని మౌలిక వసతులు, ఉపకారవేతనాలు, హాస్టల్‌ సౌకర్యం, అత్యాధునిక ల్యాబ్‌, కంప్యూటర్‌ ల్యాబ్‌, పలు సౌకర్యాలు ఉన్నాయి.

– ప్రిన్సిపల్‌ షేక్‌ ఎక్బాల్‌ హుస్సేన్‌, జీఐఎల్‌టీ

నేరుగా రైతుల నుంచే ఉత్పత్తులు కొనుగోలు చేయండి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కూకట్‌పల్లి: హోటల్‌ పరిశ్రమ వారు నేరుగా వ్యవసాయదారుల ద్వారా కూరగాయలు ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. తద్వారా ఇటు రైతులకు, అటు హోటల్‌ యజమానులకు లబ్ధి చేకూరడంతో పాటు కల్తీ లేని ఆహార పదార్థాలు లభిస్తాయిని పేర్కొన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజులో నూతనంగా ఏర్పాటు చేసిన లెమన్‌ రిడ్జ్‌ హోటల్‌, రెస్టారెంట్‌ను మంగళవారం ఆయన కూకట్‌పల్లి కాంగ్రెస్‌ ఇన్‌చార్జి బండి రమేష్‌తో కలిసి ప్రారంభించారు. హోటల్‌ నిర్వాహకుడు వెంకట నారాయణ, పుష్పరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్‌, సుధాకర్‌, ప్రకాష్‌, మద్దూరి రాము, అరుణ్‌, ఫణి కుమార్‌, శివచౌదరి, అజాజ్‌, సంధ్యా, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



కొర్లపాటి శేషారావు(ఫైల్‌)

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కోనసీమ జిల్లా ఉప్పలగొత్తెం గ్రామానికి చెందిన కొర్లపాటి శేషారావు(40) కూకట్‌పల్లి, భాగ్యనగర్‌ కాలనీలోని సుస్మిత నిలయంలోని రూమ్‌లో స్నేహితులతో కలిసి నివాసం ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. రూములో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులూ.. ఇంటర్నెట్‌తో జాగ్రత్త



సేఫ్‌ ఇంటర్‌నెట్‌ డే గురించి వివరిస్తున్న వైస్‌ ప్రిన్సిపల్‌ డా.కరుణాకర్‌ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సేఫ్‌ ఇంటర్‌నెట్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ డా.కరుణాకర్‌ మాట్లాడుతూ ఇంటర్నెట్‌ను ఎంతో సురక్షితంగా ఉపయోగించుకుంటే అంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైబర్‌ క్రైమ్స్‌, మోసాలు ఇంటర్నెట్‌ ద్వారానే జరుగుతున్నాయని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సోషల్‌ మీడియాలో తమ ప్రొఫైల్‌ ఫొటోను ఉపయోగించకూడదని, అందువల్ల జరిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవం నిర్వహించి చిరుధాన్యాల విశిష్టత, లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సానుకూల అభ్యాస వాతావరణం నెలకొల్పాలి

రాయదుర్గం: ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా నిలవాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌ హైదరాబాద్‌ రీజియన్‌ విశ్రాంత డిప్యూటీ కమిషనర్‌ శశీంద్రన్‌ సూచించారు. గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ఉపాధ్యాయుల కోసం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సానుకూల అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనేలా ప్రశాంతంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. మంగళవారం అసెంబ్లీ భవనాల కమిటీ హాల్‌ నంబర్‌–1లో ప్రజా పద్దుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇబ్బంది కల్గకుండా కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రి, బస్తీ దవాఖానాల నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. పీజీ సీట్ల పెంపు, ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడం, పని చేయని డిసిప్లినరీ రీసెర్చ్‌ యూనిట్‌, మానసిక ఆరోగ్య సంస్థలో సెంటర్‌ ఫర్‌ ఎక్సలెన్స్‌ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రజాపద్దుల కమిటీ సభ్యులు భానుప్రసాదరావు, రేవూరీ ప్రకాష్‌రెడ్డి, అబ్దుల్లా బలాల, అకౌంటెంట్‌ జనరల్‌ మాధవి, అసెంబ్లీ లెజిస్లేచర్‌ డాక్టర్‌ వి.నర్సింహాచార్యులు, ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్‌ క్రిస్టినా జెడ్‌ చోంగ్తు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి డ్రైనేజీ వ్యర్థాలపై ఫిర్యాదు

చింతల్‌: ఓ పక్క చెరువుల సుందరీకరణకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చిస్తుంటే.. మరోపక్క కొందరు చెరువుల చెర పడుతున్నారు. జీడిమెట్ల డివిజన్‌ దండమూడి ఎన్‌క్లేవ్‌ చెరువులో ఇటీవల డ్రైనేజీ వ్యర్థాలు చేరుతుండటంతో చెరువులోని నీరు కలుషితం అవుతోందని స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీజీఎం రాజేష్‌ అధికారులతో కలిసి మంగళవారం చెరువును సందర్శించారు. చెరువులో కలుస్తున్న డ్రైనేజీ ఔట్‌లెట్‌ను పరిశీలించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.



దండమూడి ఎన్‌క్లేవ్‌లో చెరువును పరిశీలిస్తున్న జలమండలి డీజీఎం రాజేష్‌

చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌



అధికారులతో కలిసి చెరువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌

నిజాంపేట్‌: చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ పేర్కొన్నారు. నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో తుర్కచెరువు, శ్రీరామ్‌కుంట చెరువులను కుత్బుల్లాపూర్‌ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ మాజీ కార్పొరేటర్లు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పరిరక్షణతో సమీప కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. పదేళ్ల కాలంలో మిషన్‌ కాకతీయ పథకం కింద నియోజకవర్గ పరిధిలోని అనేక చెరువులను అభివృద్ధి చేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువులను అభివృద్ధి పరుస్తామని తెలిపారు. అంతకుముందు స్థానిక హనుమాన్‌ ఆలయంలో ఆంజనేయ స్వామికి, కనకాల మేడలమ్మ ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ అధికారులు నిజాంపేట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ సాబెర్‌ అలీ, మేనేజర్‌ జయరాజ్‌, పవన్‌, ఏఈ ప్రవీణ్‌, మాజీ డిప్యూటీ మేయర్‌ ధనరాజ్‌ యాదవ్‌, మాజీ కార్పొరేటర్లు జ్యోతి నర్సింహారెడ్డి, బొర్రాదేవి చందు ముదిరాజ్‌, పెద్దిరెడ్డి సుజాత, బాలాజీనాయక్‌, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్‌, మాజీ కోఆప్షన్‌ సభ్యులు సయ్యద్‌ సలీం, చంద్రగిరి జ్యోతి సతీష్‌, ఉపాధ్యక్షుడు అజయ్‌ చౌదరి, 29వ డివిజన్‌ అధ్యక్షుడు నర్సింహరాజు, నాయకులు సాంబశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సదుపాయాలు కల్పించాలి



భువన విజయం గ్రౌండ్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన బాలాజీనగర్‌ డివిజన్‌లోని భువన విజయం గ్రౌండ్స్‌ను ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ ద్వారా షటిల్‌ కోర్టు, టెన్నిస్‌ కోర్టు అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. స్పోర్ట్స్‌ డిపార్టుమెంట్‌ వారు క్రీడాకారుల దగ్గర డబ్బులు వసూలు చేస్తూ తాగునీరు, బాత్‌రూమ్‌లు, వాచ్‌మెన్‌, ఎలక్ట్రికల్‌ వంటి సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అదే విధంగా పార్కు మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని, చిన్నపిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు, ఓపెన్‌ జిమ్‌ సామగ్రి మొత్తం పాడైపోయిన కారణంగా వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, పార్కుకు వాచ్‌మెన్‌ను నియమించి పార్కు మెయింటెనెన్స్‌ను అసోసియేషన్‌ వారు చూసుకోవాలని, త్వరగా పనులన్నీ పూర్తి చేసి స్థానికులకు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ పగడాల బాబురావు, డి.శంకర్‌, వీరానందం, పవన్‌, రాజేష్‌, లక్ష్మీ రాజు, సాయి, గోపి, రంగమోహన్‌, భువన విజయం గ్రౌండ్‌ అసోసియేషన్‌ వారు పాల్గొన్నారు.

మలేషియా టౌన్‌షిప్‌లో సమస్యల తిష్ట



మలేషియా టౌన్‌షిప్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బండి రమేష్‌ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ కేపీహెచ్‌బీకాలనీలోని మలేషియా టౌన్‌షిప్‌ను మంగళవారం సందర్శించారు. స్థానికులతో కలిసి టౌన్‌షిప్‌ పక్కన ఉన్న పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌ వాసులు మాట్లాడుతూ పార్కులో వాకింగ్‌కు అనుమతించడం లేదని, తప్పనిసరిగా పార్కుకు వెళ్లాలంటే 5 గంటల లెక్కన ఫీజు వసూలు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్కు ప్రభుత్వ స్థలమైనా నిర్వహణ ప్రైవేట్‌ వ్యక్తులకు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. దీంతో టౌన్‌షిప్‌ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొందని, వీధి దీపాలు లేకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని అన్నారు. స్పందించిన రమేష్‌ వెంటనే అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం బుధవారం మధ్యాహ్నం టౌన్‌షిప్‌ వాసులతో కలిసి జోనల్‌ కమిషనర్‌ను కలవనున్నట్లు బండి రమేష్‌ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్‌ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌, శివచౌదరి, టౌన్‌షిప్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు సాయిచౌదరి, రవివర్మ, కాకర్ల సురేష్‌, బి బ్లాక్‌ అధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన కండక్టర్లు

అభినందించిన డిపో మేనేజర్‌ హరి



కండక్టర్లును అభినందిస్తున్న డిపో మేనేజర్‌ హరి తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో సత్తాచాటిన కండక్టర్లను మంగళవారం డిపో మేనేజర్‌ హరి అభినందించారు. కేరళలో గత నెల 31 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు 6వ నేషనల్‌ అథ్లెటిక్స్‌ టోర్నమెంట్‌లో డిపోనకు చెందిన కండక్టర్లు టి.మంజుల, ఏ.శ్రీదేవి పాల్గొని మెడల్స్‌ సాధించారు. టి.మంజుల షాట్‌ పుట్‌లో సిల్వర్‌ మెడల్‌, హైజంప్‌లో రజతం సాధించగా.. ఏ.శ్రీదేవి 300 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్‌ మెడల్‌ సాధించారు. ట్రాఫిక్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ శ్రీలత, అసిస్టెంట్‌ మెకానికల్‌ ఇంజినీర్‌ రాజేశ్వరి, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



టాన్స్‌జెండర్స్‌కు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్‌

బాలానగర్‌: ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్‌ ఇన్‌స్పెక్టర్‌ టి. నరసింహరాజు అన్నారు. మంగళవారం తన కార్యాలయం ఆవరణలో బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నివసించే ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాల ద్వారా వారికి ఉన్న హక్కులు గురించి వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో యాచించటం చేయవద్దని, గృహప్రవేశాలు, షాపుల ప్రారంభోత్సవాలు, వివాహాలకు ట్రాన్స్‌జెండర్స్‌ వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం తగదని సూచించారు. చదువుకొని ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. అదేవిధంగా సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జర్నలిస్టు కాలనీలో ఇళ్లు నేలమట్టం



నిజాంపేట్‌: నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని జర్నలిస్టు కాలనీలోని సర్వే నంబర్‌–334లో మంగళవారం పేదల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. పది రోజుల క్రితమే తహసీల్దార్‌ పూల్‌సింగ్‌ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. తిరిగి మంగళవారం ఇదే సర్వే నంబరులోని ఓ షెడ్‌పై ఫిర్యాదు రావడంతో అధికారులు పేదల ఇళ్లను కూల్చివేశారు. సుమారు 2 సంవత్సరాల క్రితమే నిర్మాణాలు చేసుకొని నివాసం ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయించి కూల్చివేశారు. కొంతమంది తమ ఇళ్లకు తాళాలు వేసి పనులకు వెళ్తే తాళాలు పగులగొట్టి అధికారులు ఇళ్లను కూల్చివేయించారు. సమాచారం అందుకున్న నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌ రెడ్డి, కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పేదల ఇళ్లను కూల్చవద్దని తహసీల్దార్‌ పూల్‌సింగ్‌ను కోరారు. ఎన్నో రోజుల నుంచి నివాసం ఉంటున్న వారి ఇళ్లను ఎందుకు కూలుస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం కమర్షియల్‌ నిర్మాణాలను కూల్చివేశారు. జూలై కంటే ముందు నుంచి ఉన్న నిర్మాణాలు కూల్చివేయమని ప్రభుత్వం, హైడ్రా సైతం ప్రకటనలు చేస్తున్నా నిజాంపేట్‌లో మాత్రం అందుకు భిన్నంగా జరగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రహదారులు, జంక్షన్ల విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తి

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ రద్దీకి అనుగుణంగా రోడ్లు, జంక్షన్ల విస్తరణను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ పరిధిలోని ట్రిపుల్‌ ఐటీ, రాడిసన్‌ జంక్షన్ల అభివృద్ధి పనులు, శేరిలింగంపల్లి ఆర్‌ఓబీ అభివృద్ధి పనులను హెచ్‌ఎండీఏ కమిషనర్‌ సర్ఫరాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సిటీ పథకంలో భాగంగా ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌లో ఫ్లైఓవర్‌, అండర్‌పాస్‌ నిర్మాణాల కోసం ఆస్తుల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాడిసన్‌ హోటల్‌ జంక్షన్‌ను ట్రాఫిక్‌ రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేయాలని సూచించారు. అంతేకాకుండా శేరిలింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూడళ్ల విస్తరణతో పాటు సుందరీకరణ పనులు చేపట్టి సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ సీపీ జోయల్‌ డేవిస్‌, శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి, ప్రాజెక్ట్‌ అధికారులు, ట్రాఫిక్‌ పోలీసులు పాల్గొన్నారు.